క్లుప్తంగా

ఏఎంసీ చైర్మన్‌ను కలిసిన కురుమ సంఘం నాయకులు



జనగామ: జనగామ వ్యవసాయ మార్కెట్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయనున్న బాల్దె సిద్ధిలింగంను శుక్రవారం కురుమ సంఘ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం నాయకులు జూకంటి శ్రీశైలం, రిటైర్డు హెచ్‌ఎం కర్రె కృష్ణ, బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లేష్ సిద్ధిలింగాన్ని శాలువాతో సత్కరించి, స్వీట్లు తినిపించారు.

పేదింటి ఆడబిడ్డ కల్యాణానికి చేయూత



రఘునాథపల్లి: పేదింటి ఆడ బిడ్డ కల్యాణానికి మండల కేంద్రంలోని కన్యకాపరమేశ్వరి ఆలయ చైర్మన్ లగిశెట్టి భిక్షపతి–బాలమణి దంపతులు చేయూత అందజేశారు. చిల్పూరు మండల కేంద్రానికి చెందిన నలమల వెంకటయ్య కొన్నాళ్లుగా ఆలయంలో వాచ్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కూతురు పెళ్లికి వెంకటయ్య ఆర్థిక ఇబ్బందులను గుర్తించిన ఆలయ చైర్మన్ శుక్రవారం పుస్తెమట్టెలు, ఫంక్షన్ హాల్, రూ.50 వేల విలువ గల పెళ్లి సామగ్రి అందజేసి దాతృత్వం చాటారు. పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆలయ చైర్మన్ దంపతులు చేయూత అందించడం పట్ల రాష్ట్ర శ్రీరామదాసు భజన మండలి అధ్యక్షుడు సిద్దేశ్వర్‌తో పాటు పలువురు అభినందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండకు చెందిన గునిగంటి మల్లయ్య గుండెపోటుతో గురువారం రాత్రి మృతిచెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని జెడ్పీటీసీ మారపాక రవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మృతదేహంపై పూలమాల వేసి సంతాపం తెలిపారు. బాధిత కుటుంబానికి వైస్ ఎంపీపీ రూ.10వేలు ఆర్థికసాయాన్ని అందించారు.

పరామర్శ..

డివిజన్ కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు చిలగాని విజయ్ భార్య శోభ మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందింది. కాగా, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, తాటికొండ సర్పంచ్ చల్లా ఉమా శుక్రవారం శివునిపల్లిలో విజయ్‌ను, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వివాహిత ఆత్మహత్య



శ్యామల (ఫైల్)

కొడకండ్ల: మండలంలోని పాకాలకు చెందిన రాచకొండ శ్యామల (25) కడుపునొప్పి భరించలేక శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొన్నట్లు హెచ్‌సీ సంపత్‌రాజ్ తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా కడుపునొప్పితో బాధపడుతూ ఆమె మనస్థాపంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకొంది. కాగా, మృతురాలి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతురాలికి భర్త లింగయ్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

దరఖాస్తు గడువు పెంపు

పాలకుర్తి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, వెనుక బడిన తరగతుల సంక్షేమ (మహాత్మ జ్యోతిబాపూలే) గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి ప్రవేశానికి దరఖాస్తు తేదీ ఈనెల 20 వరకు పొడిగించారు. 5వ తరగతిలో ప్రవేశానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనుమల లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జనగామ రూరల్: ప్రబోధ సేవాసమితి జనగామ కమిటీ ఆధ్వర్యంలో ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల త్రైత శతకం తెలుగు క్యాలెండర్, త్రైత సిద్ధాంత భగవద్గీతను శుక్రవారం హైదరాబాద్‌లో సినీ నటుడు సుమన్, జపాన్ కరాటే అసోసియేషన్ చైర్మన్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

‘కంటి వెలుగు’ను వినియోగించుకోవాలి

● ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి



బచ్చన్నపేట: కంటివైద్య శిబిరంలో వృద్ధులతో ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

బచ్చన్నపేట: కంటివెలుగు శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పోచన్నపేటలో కంటి వెలుగు శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా శిబిరానికి కంటి పరీక్షల కోసం వచ్చిన వారితో ముచ్చటించారు. ‘అవ్వా అద్దాలు ఎలా ఉన్నాయి.. కళ్లు మంచిగా అగుపిస్తున్నాయా’ అని అడిగారు. సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు శిబిరానికి వచ్చిన వారికి ఆలస్యం కాకుండా త్వరగా పరీక్షలు నిర్వహించి పంపించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గట్టు మంజుల, ఎంపీటీసీ మామిడి అరుణ, నాయకులు అయిలయ్య, మల్లేశం, వైద్యులు, అంగన్‌వాడీలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కంటి పరీక్షలు చేసుకోండి

లింగాలఘణపురం: కంటి చూపు సమస్య ఉన్న ప్రతీ ఒక్కరు కంటి వెలుగు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సర్పంచ్ ఐల మల్లేశం కోరారు. శుక్రవారం గ్రామంలో ఆయన కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంపీటీసీ సోమలక్ష్మికుమార్, ఉపసర్పంచ్ బర్ల గణేష్, వార్డు సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిబ్బందికి సన్మానం

జఫర్‌గఢ్: సూరారంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసినందుకు సంబంధిత సిబ్బందికి సర్పంచ్ మేడిపల్లి రాజేశ్వరి ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా కంటి వెలుగు శిబిరాలను నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమం ద్వారా కంటి సమస్యతో ఎవరు ఇబ్బంది పడకుండా వారికి ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడంతో పాటు అద్దాలు



జఫర్‌గఢ్: సన్మానం పొందిన సిబ్బంది

పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా సూరారం గ్రామంలో కొద్ది రోజుల పాటు కంటి శిబిరాన్ని నిర్వహించి సమస్య ఉన్నవారికి అద్దాలు అందజేశామన్నారు.

డ్రా పద్ధతిన ‘డబుల్’ ఇళ్ల కేటాయింపు



డ్రా పద్ధతిన డబుల్ బెడ్రూం ఇళ్లను కేటాయిస్తున్న అధికారులు

దేవరుప్పుల: మండలంలోని అప్పిరెడ్డిపల్లిలో డబుల్ బెడ్రూం ఇళ్లను లబ్ధిదారులకు డ్రా పద్ధతిన కేటాయించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్ పులిగిళ్ల సుధాకర్ అధ్యక్షతన ఇళ్ల కేటాయింపు నిర్వహించారు. ఈసందర్భంగా తహసీల్దార్ ఎడ్ల రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం నిర్మించిన ఇళ్లను పారదర్శకంగా లబ్ధిదారుడిని ఎంపిక చేసి కేటాయించడం జరుగుతుందన్నారు. 30 మంది లబ్ధిదారులకు గాను రెండు అభ్యంతరాలు ఉంటే తుది పరిశీలన కోసం నిలిపివేశామన్నారు. ఎంపీపీ బసవ సావిత్రిమల్లేష్, జెడ్పీటీసీ పల్లా భార్గవి, ఎంపీడీఓ సురేష్‌కుమార్, ఉపసర్పంచ్ ఎస్ ప్రభావతి, పంచాయతీ కార్యదర్శి అమరేందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

బండా ప్రకాశ్‌కు ఆహ్వానం



బచ్చన్నపేట: బచ్చన్నపేట శివారు ఎద్దుగూడెంలో ఈ నెల 25 నుంచి నిర్వహించనున్న పోచమ్మతల్లి ఉత్సవాలకు హాజరుకావాలని శాసనమండలి వైస్ చైర్మన్, ముదిరాజ్ మహా సభ అధ్యక్షుడు బండా ప్రకాష్‌ను గ్రామస్తులు శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. జెడ్పీ వైస్ చైర్ పర్సన్ గిరబోయిన భాగ్యలక్ష్మి, నాయకులు అంజయ్య, ఎద్దు యాదగిరి, రామలింగం, ప్రభాకర్, సత్యకుమార్, హరీష్, మహేందర్, శ్రీశైలం పాల్గొన్నారు.

ఆర్థికసాయం..

ఎద్దుగూడెంలో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి కేబీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ నాయకులు కొండి వెంకట్‌రెడ్డి ఆర్థికసాయాన్ని అందించారు. ఆలయ నిర్మాణానికి పలువురు దాతలు సహకరించాలని కోరారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించాలి



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం, అధికారులు

స్టేషన్‌ఘన్‌పూర్: విద్యార్థులకు చదువు, క్రమశిక్షణతో పాటు దేశభక్తిని పెంపొందించేలా ఉపాధ్యాయులు పాటుపడాలని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్ హెచ్‌ఎం కొమురయ్య, ఎన్‌సీసీ అధికారి కె.ప్రకాశం అన్నారు. మండలంలోని ఛాగల్లు జెడ్పీఎస్ఎస్‌లో విద్యార్థులకు 2023–24 సంవత్సరానికి ఎన్‌సీసీ ఆర్మీ విభాగంలో సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, జాతీయ సమైక్యత, క్రమశిక్షణ, దేశభక్తి, నాయకత్వలక్షణాలు తదితర ఉత్తమ లక్షణాలు పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడుతుందన్నారు. పాఠశాల నుంచి మొత్తం 82 మంది విద్యార్థులు పోటీపడగా 10 మంది బాలికలు, 15 మంది బాలురు ఎంపికైనట్లు తెలిపారు. ఎన్‌సీసీ ఆర్మీ ఆఫీసర్ భరత్, సాయికుమార్, రాజేంద్రప్రసాద్, సుదర్శన్, అంజిరెడ్డి, రఘుపతి, కరంచంద్, శాంతి, పరమేశ్వరి పాల్గొన్నారు.

క్లుప్తంగా

చెక్కు పంపిణీ



దేవరుప్పుల: విజయ పాల ఉత్పత్తి దారుడి కుమార్తెకు విజయ డెయిరీ పెళ్లికానుకగా రూ. 5వేల చెక్కును శుక్రవారం ఆ డెయిరీ కామారెడ్డిగుడెం అధ్యక్షుడు గులాం రసూల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి రైతులకు పశుదాణపై రు. 300 సబ్సిడీ, క్యాల్షియం, మినరల్ మిక్చర్‌పై 50 శాతం సబ్సిడీ, ప్రభుత్వ బ్యాంకుల నుంచి పాడి రుణాల మంజూరు, ఉచిత పశు వైద్య శిబిరం మొదలైన సౌకర్యాలు విజయ డైయిరీ సమకుర్చుతుందని తెలిపారు. ఉప సర్పంచ్ మరాఠి కృష్ణ, ఉపాధ్యక్షులు బజ్జూరి భిక్షపతి, షబ్బీర్‌ఆలీ, ఖలీల్‌భాషాతోపాటు తదితరులు పాల్గొన్నారు.

చేయూత



చిల్పూరు: మండల కేంద్రానికి చెందిన అన్నం కుమార్ తల్లి సరోజన ఇటీవల మృతి చెందింది. కాగా, శుక్రవారం నిర్వహించిన సంతాప సభలో 2001లో కుమార్‌తో చదువుకున్న మిత్రులు దోకి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రూ. 24 వేల ఆర్థిక సాయం అందజేశారు. బ్రహ్మచారి, క్రాంతి, శేఖర్, హరిశంకర్, రవి పాల్గొన్నారు.

పరామర్శ

స్టేషన్‌ఘన్‌పూర్: శివునిపల్లికి చెందిన సీనియర్ జర్నలిస్టు చిలగాని విజయ్ భార్య శోభారాణి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర శుక్రవారం శివునిపల్లిలో జర్నలిస్టును, అతడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. శోభారాణి మృతిపట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు.

నియామకం



చిల్పూరు: మండలంలోని రాజవరం గ్రామానికి చెందిన ఇరుగు రాజు బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే రాజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు. ఎమ్మెల్యే రాజయ్యకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

రక్తదానం



బచ్చన్నపేట: ప్రతి ఒక్కరూ ఆపదలో ఉన్న వారికి ఇచ్చే రక్తదానం తీసుకునే వారికి ప్రాణ దానంతో సమానమని మండలంలోని వంగ సుదర్శన్‌రెడ్డి నగర్ గ్రామ సర్పంచ్ కోనేటి స్వామి అన్నారు. శుక్రవారం మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ ఆర్‌వీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెకు రక్తం అత్యవసరం కాగా సమాచారం మేరకు సర్పంచ్ స్వామి వెళ్లి రక్తదానం చేశాడు. రక్త దానం చేసిన సర్పంచ్‌ని ఆమె కుటుంబ సభ్యులతో పాటు పలువురు అభినందించారు.

సంజయ్ అరెస్టు అప్రజాస్వామికం

పాలకుర్తి టౌన్: టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీని నిరసిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, ఈటెల రాజేందర్ చేపట్టని నిరసన దీక్షను పోలీసు బలగాలతో భగ్నం చేయడం అప్రజాస్వామికమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు దొంగరి మహేందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో అయన మట్లాడుతూ నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో తెచ్చుకున్న తెలంగాణలో నియామాకాలు ఇచ్చే కనీస జ్ఞానం ప్రభుత్వానికి లేదన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు



బోర్ పనులు ప్రారంభిస్తున్న శ్రీధర్‌రావు

చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట శ్రీబుగులు వేంకటేశ్వరస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతున్నట్లు ఆలయ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు చెప్పారు. చిల్పూరుగుట్ట అంగడి ప్రదేశంలో బోర్ పనులను అర్చకుల వేద మంత్రాల నడుమ చైర్మన్, ఇన్‌చార్జ్ ఈఓ వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేవుని ఆశీస్సులతో కేవలం 80 ఫీట్లలోనే నీరు పడిందని అయినా వేసవిని దృష్టిలో ఉంచుకొని 240 ఫీట్ల వరకు బోర్ వేయించామన్నారు. అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, కుంచాల సంపత్‌రాజు, జంగిటి కుమార్, వేల్పుల గట్టయ్య, సిబ్బంది రమేష్, వీరన్న, శ్రీలత, లక్ష్మి, మల్లికార్జున్ ఉన్నారు.

పుస్తెమట్టెల అందజేత



బచ్చన్నపేట: పుస్తెమట్టెలు అందజేస్తున్న సర్పంచ్ దివ్య



తరిగొప్పుల: పుస్తెమట్టెలు అందజేస్తున్న ఆవుల శ్రీనివాస్

బచ్చన్నపేట: కేసిరెడ్డిపల్లిలో ఆడకూతుళ్ల పెళ్లిళ్లకు సర్పంచ్ మల్లవరం దివ్యారెడ్డి పుస్తెమట్టెలను శుక్రవారం అందించారు. గ్రామానికి చెందిన గొల్లూరి మల్లమ్మ, సిద్దయ్యల కూతురు మౌనిక, జక్కుల స్వప్న, రాజు దంపతుల కూతురు మనీషా పెళ్లిళ్లకు పుస్తెమట్టెలను అందజేశారు. జనగామ మున్సిపల్ కౌన్సిలర్ మల్లవరం అరవింద్‌రెడ్డి, మధు, సందీప్, భాస్కర్, రాజమౌళి, చెంద్రయ్య, సుధాకర్, సామెలు పాల్గొన్నారు.


ముక్కెర ఆధ్వర్యంలో..

సామాజిక సేవా కర్త, బీజేపీ రాష్ట్ర నాయకుడు ముక్కెర తిరుపతిరెడ్డి పలు గ్రామాల్లో శుక్రవారం పుస్తెమట్టెలను అందించారు. నిరుపేదలను ఆదుకోవడానికి ముందంజలో ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పోతారంలో..

తరిగొప్పుల: మండలంలోని పోతారం గ్రామానికి చెందిన సుంకు లక్ష్మి, స్వర్గీయ నర్సయ్య దంపతుల కుమార్తె ఉమ వివాహానికి బీజేపీ రాష్ట్ర నాయకుడు ముక్కెర తిరుపతిరెడ్డి పంపించిన పుస్తెమట్టెలను మండల అధ్యక్షుడు ఆవుల శ్రీనివాస్ శుక్రవారం అందజేశారు. పులి గణేష్, దినేష్, రాజు, వినేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రీతి మృతికి కారకులను శిక్షించాలి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న రాజేష్‌నాయక్

కొడకండ్ల: వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతికి కారకులైన వారిని చట్టరీత్యా కఠినంగా శిక్షించాలని పాలకుర్తి నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధరావత్ రాజేష్‌నాయక్ డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రీతి కుటుంబసభ్యులను కలిసేందుకు గిర్నితండాకు వచ్చిన మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో జరిగిన దిశ సంఘటనలో నిందితులపై ఏ విధమైన చర్యలు తీసుకొన్నారో ప్రీతి ఘటనలో కూడా తీసుకోవాలన్నారు. కేఎంసీ ప్రిన్సిపాల్, హెచ్‌ఓడీలను సస్పెండ్ చేసి హత్యానేరం కేసు నమోదు చేయాలని, ప్రీతి కుటుంబానికి రూ.5 కోట్లు ప్రభుత్వం ద్వారా అందించి ఆదుకోవాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలని మంత్రిని కోరారు. నాయకులు సుధీర్, సిద్దూ, హరిచందర్, హేమాని, సురేష్‌నాయక్, నికిల్, కృష్ణ, గణేష్, రాజు, రమేష్ పాల్గొన్నారు.

అభినందనలు



రఘునాథపల్లి: జనగామ వ్యవసాయ నూతన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా నియామకమైన బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ముసిపట్ల విజయ్‌ను శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ నాయకులు అభినందించారు. జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు పోకల శివకుమార్, జిల్లా జెడ్పీటీసీల ఫోరం అధ్యక్షుడు బొల్లం అజయ్, మాజీ ఎంపీపీ కుమార్‌గౌడ్ తదితరులు విజయ్‌ను శాలువాలతో అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిన్న వయస్సులోనే విజయ్‌కు మార్కెట్ వైస్ చైర్మన్ పదవి వరించడం అభినందనీయమన్నారు. మార్కెట్ అభివృద్ధికి పాటుపడుతూ రైతుల పక్షాన ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తూ మన్ననలు పొందాలని వారు ఆకాంక్షించారు.

ఉద్యోగ నియామకాల నోటిఫికేషన్లు రద్దు చేయాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి

స్టేషన్‌ఘన్‌పూర్: టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి పదవీ కాలంలో వచ్చినటువంటి ఉద్యోగనియామకాల నోటిఫికేషన్లను రద్దుచేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని శివునిపల్లిలో శుక్రవారం బీఎస్పీ ముఖ్య కార్యకర్తల సమావేశం నియోజకవర్గం అధ్యక్షుడు మోకినపల్లి చక్రపాణి అధ్యక్షత నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ అసిస్టెంట్ ఇంజనీర్ల నోటిఫికేషన్ నియామకంలో జరిగిన పేపర్ లీకేజీ తదితర అంశాలపై సీబీఐ, సీఐడీ ఎంక్వయిరీ చేయించకుంటే ఆమర నిరాహార దీక్ష చేపడ్తానని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ హెచ్చరించినా ప్రభుత్వం పట్టించుకోక పోవడంతో శుక్రవారం శాంతియుతంగా దీక్ష చేపడ్తే భగ్నం చేయించడం ప్రభుత్వ చేతకానితనానికి నిదర్శనమన్నారు. దీన్ని ప్రతీ ఒక్కరూ ఖండించాలని కోరారు. నాయకులు సింగపురం సమ్మయ్య, జీడి యాకూబ్, జలగం ప్రవీణ్, దీపక్‌రాజు పాల్గొన్నారు.

పేపర్ లీక్‌పై సీబీఐతో విచారణ చేపట్టాలి

స్టేషన్‌ఘన్‌పూర్: టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ విషయంపై సీబీఐతో విచారణ చేపట్టాలని వైఎస్సార్ టీపీ ఘన్‌పూర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సంగాల ఈర్మియా డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్నాపత్రాల లీకేజీ విషయమై టీఎస్‌పీఎస్‌సీ కార్యాలయ ముట్టడికి వైఎస్సార్‌టీపీ అధినేత్రి షర్మిల పిలుపునివ్వగా ఆమెను హౌస్ అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊరడి శ్రీను, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు మేడ ప్రశాంత్, మోహన్, నరేష్ పాల్గొన్నారు.

యువత చేతుల్లోనే దేశ భవిష్యత్

● ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. వరంగల్ నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో స్థానిక విద్యాజ్యోతి డిగ్రీ, పీజీ కళాశాలలో ‘నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్’ అనే అంశంపై శుక్రవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నేటి ఆధునిక ప్రపంచం ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒకే భవిష్యత్ అనే నినాదంతో ముందుకు వెళ్తున్న తరుణంలో యువత చైతన్యవంతం కావాలన్నారు. బాగా మాట్లాడం ద్వారా సమాజాన్ని ప్రభావితం చేయవచ్చని, పాఠశాల స్థాయి నుంచే మాట్లాడటం నేర్చుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం అధికారి దేవీలాల్, కళాశాల ప్రిన్సిపాల్ థామస్‌కిరణ్, కేయూ రాజనీతి శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. క్యాంపు కార్యాలయంలో వివిధ మండలాలకు చెందిన 51 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే చెక్కులు పంపిణీ చేశారు.

కొనసాగుతున్న దీక్షలు



దీక్షలో కూర్చున్న లబ్ధిదారులు

జనగామ రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టి లబ్ధిదారులకు అందజేయాలని సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం నాటిని 35వ రోజులకు చేరుకున్నాయి. ఇళ్ల సాధన కమిటీ సభ్యులు కె. కస్తూరి దీక్షలను ప్రారంభించి మాట్లాడారు. రజిత, బాలమణి, సుజాత, బాబురావు, కమల, శాంత, మంజుల, రేణుక పాల్గొన్నారు.